క్లుప్తంగా

సెన్సార్ బోర్డు సభ్యురాలికి సన్మానం



మహబూబ్‌నగర్ రూరల్: కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యురాలుగా నియమితులైన పత్తి అంజమ్మను ఆదివారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని టీటీగుట్ట ప్రాంతంలో అంజమ్మ ఇంటికి వెళ్లి మాల మహానాడు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు బాలరాజు, అధికార ప్రతినిధి కృష్ణయ్య, కార్యదర్శి బాలరాజు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు యాదయ్య పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి..

పాలమూరు: ఇటీవల నూతనంగా మహబూబ్‌నగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నిక అయిన పి.శ్రీనివాస్‌రెడ్డిని ఆదివారం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మజారెడ్డి, పడకుల బాలరాజు సంయుక్త ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. నేతలు అంజయ్య, కృష్ణవర్ధన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, రాజేందర్‌రెడ్డి, హరికృష్ణ, కిష్టనాయక్ తదితరులు పాల్గొన్నారు.

భయంతోనే ముఖం చాటేశారు

చిన్నచింతకుంట: బీజేపీ అమ్ముడు పోయింది కాబట్టే డీకే అరుణ భయపడి రామాలయంలో ప్రమాణానికి ముఖం చాటేశారని కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో డీకే అరుణ రూ. 15 కోట్లకు అమ్ముడు పోవడం వాస్తవమన్నారు. ఇలాంటి వారిని నమ్మవద్దనారు. ప్రతాప్, రహిమత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ చైర్మన్‌గా రవీందర్‌రెడ్డి

మిడ్జిల్: మండలపరిధిలోని వెలుగొమ్ముల లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం గ్రామపెద్దల సమక్షంలో సమావేశం నిర్వహించి ఎన్నిక చేపట్టినట్లు తెలిపారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



అడ్డాకుల: గ్రామాల్లో పార్టీ పటిష్టతకు యూత్ కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలని మూసాపేట మండల యూత్ అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. సంకలమద్ది, తిమ్మాపూర్ గ్రామాల్లో ఆదివారం యూత్ కాంగ్రెస్ బూత్ కమిటీలను ఏర్పాటు చేశారు. సంకలమద్దిలో 83వ బూత్‌కు సురేందర్ ముదిరాజ్(సిద్దు)ను ఎంపిక చేశారు. తిమ్మాపూర్‌లో 79వ బూత్‌కు హరి శంకర్‌గౌడ్‌ను ఎంపిక చేసినట్లు వివరించారు. బూత్‌స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే విధంగా యూత్ నాయకులు కృషి చేయాలని కోరారు. నూతన అధ్యక్షులను సత్కరి అభినందించారు. కార్యక్రమంలో రత్నయ్య, సురేష్ తదితరులు ఉన్నారు.

మహిళ అదృశ్యం

జడ్చర్ల: మండల పరిధిలోని నసరుల్లాబాద్ గ్రామానికి చెందిన మహిళ అదృశ్యమైనట్లు సీఐ రమేశ్‌బాబు తెలిపారు. శనివారం రాత్రి ఇంట్లో నిద్రించి తెల్లారేసరికి కనిపించకుండా పోయిందని ఆమె భర్త తెలిపారని వివరించారు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

అడ్డాకుల: మండలంలోని బలీదుపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గౌని నర్సింహారెడ్డి ఆదివారం తెల్లవారుజామున ఇంటి వద్దే గుండెపోటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు మహబూబ్‌నగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి డాక్టర్ జి.చిన్నారెడ్డి పరామర్శించారు. నర్సింహారెడ్డి మృతదేహంపై పూల మాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా వింకో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. విజయమోహన్‌రెడ్డి, భీమన్న యాదవ్, రాములు, వెంకట్‌రెడ్డి, బాలయ్య, కరుణాకర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు ముఖ్య కార్యకర్తల సమావేశం

మహమ్మదాబాద్: నియోజకవర్గ కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు గండేడ్, మహమ్మదాబాద్ మండలాల అధ్యక్షులు పెంట్యానాయక్, భిక్షపతిలు తెలిపారు. సోమవారం సమావేశానికి కేటీఆర్ హాజరుకానున్నట్లు వివరించారు. ముఖ్య కార్యకర్తలు, నాయకులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

పాఠశాలల్లో ఆకతాయిల అకృత్యాలు

- మద్యం తాగి తరగతి గదుల్లో సీసాలు వేస్తున్న వైనం
- సిట్టింగ్‌లకు అడ్డాలుగా రైతువేదికలు సైతం

హన్వాడ: నియోజకవర్గ పరిధిలోని పాఠశాలలకు రక్షణ కరువవుతోంది. సెలవులు వచ్చాయంటే చాలు సరస్వతీ నిలయాల్లో ఆకతాయిల ఆగడాలకు అదుపులేకుండా పోతోంది. కొంతమంది మద్యం తాగడానికి వాటిని అడ్డాలుగా మార్చుకుంటుండం, ఆకతాయి పనులు చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. పై పెచ్చు సీసాలు అక్కడే పగులగొట్టి తరగతి గదుల్లో వేస్తుండడం గమనార్హం. ఇంత జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని పలువురు వాపోతున్నారు. అక్షరజ్ఞానాన్ని పంచే దేవాలయాల్లాంటి పాఠశాలలకు రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మద్యానికి బానిసైన కొంతమంది ఇంగిత జ్ఞానం మరిచి విద్యాలయాల్లో ఇలాంటి అకృత్యాలకు పాల్పడుతున్న ఘటనలు నియోజకవర్గంలో కోకొల్లలున్నాయి.



నాయినోనిపల్లి పీఎస్‌లో ఆకతాయిలు వేసిన మద్యం సీసాలు

మండలంలోని నాయినోనిపల్లి ప్రాథమిక పాఠశాల మందుబాబులకు సిట్టింగ్‌గా మారింది. ప్రధానరహదారికి పక్కనే ఉన్న పాఠశాలలో రాత్రిపూట నిత్యకృత్యంగా మారిపోయిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తెల్లారేసరికి పాఠశాల ప్రాంగణంలో, వరండాల్లో మందుబాబుల సిట్టింగ్ కారణంగా అక్కడక్కడ తాగి ఖాళీ అయిన మద్యం సీసాలు, గ్లాసులు, కవర్లు, ఇతర చెత్తాచెదారం దర్శనమిస్తున్నాయి. పై పెచ్చు సీసాలను సైతం తరగతి గదిలో పగులగొడుతున్నారు. విషయంపై హెచ్ఎం ఉషారాణి సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినా లాభలేకపోవడం గమనార్హం. కాగా ఘటనపై పలుమార్లు మందలించినా ప్రయోజనం లేకపోయిందని సర్పంచ్ చెన్నయ్య వాపోతున్నాడు. అదేవిధంగా పాఠశాల పక్కనే అంబేడ్కర్ విగ్రహం వద్ద సైతం కొందరు ఇలాంటి పనులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సైతం మందుబాబులకు అడ్డాగా మారిందని పలువురు విమర్శిస్తున్నారు. ఇటీవలే మున్సిపాలిటీలోని 16వ వార్డులో సైతం ఇలాంటి ఘటన చోటు చేసుకుందని తెలుస్తోంది. సెలవుల సమయం కావడంతో విషయం బయటకి రాలేదని సమాచారం. దీనిపై విచారణ సాగుతోందని తెలియవచ్చింది. వీటికి తోడు ఇటీవల నిర్మించిన రైతు వేదికలు సైతం జతయ్యాయి. ఇటీవల వేపూర్‌లో రైతువేదిక వద్ద కొందరు మద్యం సేవించి అక్కడే సీసాలు పగులగొట్టి ప్రాంగణాన్ని చిందరవందరగా మార్చడం గమనార్హం.

విచ్చలవిడిగా బెల్టు దుకాణాలు...

ఇదిలా ఉండగా నియోజకవర్గంలోని హన్వాడ, మహబూబ్‌నగర్ పట్టణం, రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో వీధికో బెల్టుదుకాణాలు ఉన్నట్లు ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. వీటి వల్లనే మద్యం ఏరులై పారుతోందని మందుబాబుల సంఖ్య పెరిగిపోతూ ఇలాంటి ఘటనలకు కారణమవుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆదివారాలు, సెలవురోజులు, కొన్నిచోట్ల నిత్యం ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నట్లు చెబుతున్నారు. పోలీసులు ఇలాంటి పనులకు పాల్పడేవారిపై చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

విలువల్ని మంటగలుపుతున్నారు



మా పాఠశాల ప్రాంగణాన్ని కొందరు మందుబాబులు అడ్డాగా మార్చుకుని మద్యం సేవిస్తూ విలువల్ని మంటగలుపుతున్నారు. వరండాల్లో, పరిసరాల్లో మద్యం తాగిన సీసాలు వేస్తున్నారు. కొన్నిసార్లు పగులగొడుతున్నారు. దీంతో విద్యార్థులకు ఇబ్బంది కలుగుతోంది. విషయాన్ని సర్పంచ్‌కు తెలిపాం. గ్రామంలో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

–ఉషారాణి, ప్రధానోపాధ్యాయురాలు

పోలీసులకు ఫిర్యాదు చేస్తాం



ఇలాంటి చర్యకు పాల్పడింది ఎవరనేది స్పష్టంగా తెలియడం లేదు. దీనిపై గ్రామ సభ నిర్వహించి ఎవరనేదానిపై చర్చించి నిర్ణయం తీసుకుంటాం. పాఠశాలను దేవాలయంతో సమానంగా చూస్తున్నాం. ఇక ముందు ఇలాంటివి చోటుచేసుకుంటే నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేసి.. కఠిన చర్యలు తీసుకునేలా చేస్తాం.

– చిన్నచెన్నయ్య, సర్పంచ్, నాయినోనిపల్లి

సిట్టింగ్‌లు పెడితే జైలుకే



రాత్రిపూట బహిరంగంగా మద్యం సేవించడం నిషేదం. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. పాఠశాల ప్రాంగణాల్లో, ఇతర ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడితే నేరుగా జైలుకే పంపిస్తాం. ఎవరైనా ఇలాంటి ఘటనలు జరుతున్నప్పుడు గమనించి మా దృష్టికి తెస్తే తక్షణమే చర్యలు తీసుకుంటాం.

– రవినాయక్, ఎస్ఐ, హన్వాడ

రామాలయం శుద్ధి చేసిన బీజేపీ నేతలు

పాలమూరు: జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో ఉన్న రామాలయాన్ని బీజేవైఎం ఆధ్వర్యంలో శుద్ధి చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని బహిష్కరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు రామాలయం లోపలికి రావడం వల్ల అపవిత్రం అయ్యిందని అన్నారు. దీంతోపాటు డీకే అరుణపై అనుచిత వ్యాఖ్యలు చేసి, రాముడిపై ప్రమాణం చేయడాన్ని ఖండిస్తూ ఆలయాన్ని శుద్ధి చేసినట్లు తెలిపారు. రాజకీయ లబ్ధికోసమే చిల్లర రాజకీయాలు చేస్తున్నారని, ఒక మహిళపైన నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీలోని అగ్రనాయకులపై అసత్య ప్రచారాలు చేస్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. ఇలాంటి చిల్లర రాజకీయాలు కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య అని తెలిపారు. నేతలు కృష్ణవర్ధన్‌రెడ్డి, అంజయ్య, సాహితీరెడ్డి, నారాయణ, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించండి

స్టేషన్ మహబూబ్‌నగర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ (ఎస్సీ రిజర్వుడ్) స్థానానికి తన పేరు పరిశీలించాలని కోరుతూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ నాయకుడు ఎస్.వినోద్‌కుమార్ ఆదివారం జిల్లా కేంద్రంలో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గత 34 ఏళ్ల నుంచి కాంగ్రెస్‌లో చురుగ్గా పనిచేస్తూ పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. సేవలను గుర్తించి అవకాశం కల్పించాలన్నారు.

ముదిరాజ్‌ల బీసీ ‘ఏ’ సాధనకు కృషిచేస్తాం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, శ్రీహరి, వంశీచందర్‌రెడ్డి తదితరులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీసీ డీ గ్రూప్‌లో ఉన్న ముదిరాజ్‌లను ‘ఏ’ గ్రూప్‌లోకి మార్చాలని ఎన్నో ఏళ్లుగా చేస్తున్న డిమాండ్ సాధనకు తమ వంతు కృషి చేస్తామని ఎమ్మెల్యేలు యెన్నంశ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి తెలిపారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచందర్‌రెడ్డితో కలిసి ముదిరాజ్ ఉద్యోగ సంఘం క్యాలెండర్, డైరీని ఎమ్మెల్యేలు ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు జనార్దన్ మాట్లాడుతూ జనాభా ప్రతిపాదికన కార్పొరేషన్ల పదవుల్లో ముదిరాజ్‌లకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వెయ్యి కోట్లతో ముదిరాజ్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎన్పీ వెంకటేశ్, సంజీవ్‌ముదిరాజ్, సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు మధు, ప్రధాన కార్యదర్శి విజయబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి విజయ్‌కుమార్, శంకర్, ఆంజనేయులు, సూర్యప్రకాష్, సత్యనారాయణ, శేఖర్, శ్రీనివాసులు, మహేష్, అరవిందు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: లంబాడ, ఎరుకల, చెంచు ఉద్యోగులందరు ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో గిరిజన ఉద్యోగ సంఘం నూతన కమిటీ ప్రమాణస్వీకారానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. గిరిజన భవన్ నిర్మాణానికి రూ.10 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. సేవాలాల్ జయంతి సమయంలో ఘడ్ గుత్తికి వెళ్లేందుకు తన వంతుగా ఒక బస్సును ఏర్పాటు చేస్తానన్నారు. మొదటి వారంలో జిల్లాలో పనిచేస్తున్న గిరిజన ఉద్యోగ సంఘం నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై చర్చిద్దామన్నారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా బలరాంనాయక్, అధ్యక్షుడిగా రామునాయక్, ప్రధాన కార్యదర్శిగా నారాయణ, ప్రియాంకబాయ్ రాథోడ్, కోశాధికారిగా శంకర్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గోపాల్‌నాయక్, అసోసియేట్ అధ్యక్షుడిగా నర్సిములు, ఉపాధ్యక్షులుగా చిన్యానాయక్, శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీగా యాదమ్మ, ప్రచార కార్యదర్శిగా ముడావత్ శివకృష్ణ, న్యాయ సలహాదారులుగా బాలయ్య, శంకర్‌నాయక్ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా గిరిజన సేవా సంఘం గౌరవాధ్యక్షుడు రాంచందర్‌నాయక్, రమణయ్య, రమేశ్‌నాయక్, రవిరాథోడ్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు పర్మినెంట్ చేయాలి



హన్వాడ: పంచాయతీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని ఆదివారం మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. మల్టీపర్పస్ వర్కర్స్ విధానం వల్ల తీవ్రంగా నష్టపోతున్నట్లు కార్మికులు వివరించారు. టీఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగన్న, కారోబార్ బాలకిష్టయ్య, రాములమ్మ, బాలమణి, రంగయ్య, రాములు, వెంకటయ్య పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి నిర్వహణపై తీర్మానం

నవాబుపేట: సేవాలాల్ జయంతి నిర్వహణకు సంబంధించి నూతన ఉత్సవ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. బంజార భవన్‌లో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా తులసీ రాంనాయక్, ప్రధానకార్యదర్శిగా సంతోష్‌నాయక్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా లింభ్యానాయక్, చందర్‌నాయక్, శంకర్‌నాయక్, రాజునాయక్, సేవ్యానాయక్‌లను ఎన్నుకున్నట్లు బంజార నాయకులు వివరించారు. కాగా ప్రతి గిరిజన తండాలో సేవాలాల్ జయంతి ఘనంగా నిర్వహించాలని కమిటీ తీర్మానం చేసినట్లు వివరించారు. లింగంనాయక్, పాండు, అంగూర్‌నాయక్, వెంకటేష్, భాస్కర్, శంకర్ నాయక్ తదితరులు ఉన్నారు.

కోయిల్‌కొండ ఎస్ఐగా రాఘవేందర్

కోయిల్‌కొండ: ఎస్ఐగా కోయిల్‌కొండ పోలీస్‌స్టేషన్‌లో రాఘవేందర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన విజయ్ భాస్కర్ మహబూబ్‌నగర్ వీఆర్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో జడ్చర్ల నుంచి రాఘవేందర్ వచ్చారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా కమతం శ్రీనివాస్‌రెడ్డి

మహమ్మదాబాద్: ఉమ్మడి మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా కమతం శ్రీనివాస్‌రెడ్డి తిరిగి కొనసాగాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. గత నవంబర్ 11న సహకార సంఘం సభ్యులు అవిశ్వాసం ప్రవేశపెట్టడంతో కమతం శ్రీనివాస్‌రెడ్డికి వ్యతిరేకంగా 9మంది వేశారు. దీంతో గిరమోని లక్ష్మీనారాయణ తాత్కాలిక చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో శ్రీనివాస్‌రెడ్డి కోర్టును ఆశ్రయించారు. కాగా ఈనెల 31వరకు కమతం శ్రీనివాస్‌రెడ్డి తిరిగి చైర్మన్‌గా కొనసాగాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆదివారం ఆయన పత్రికా విలేకర్ల సమావేశంలో కోర్టు ఉత్తర్వులను చూయించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: టీపీఆర్టీయూ నూతన కార్యవర్గాన్ని సీనియర్ నాయకులు సాయిరెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా శ్యాంబాబు, ప్రధాన కార్యదర్శిగా రమాకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నాగిరెడ్డి, ట్రెజరర్‌గా దండురాఘవలను ఎన్నుకున్నట్లు వివరించారు. టీపీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి హాజరై నూతన కార్యవర్గాన్ని అభినందించారు. 317 జీవో బదిలీలుపై కార్యవర్గంలో చర్చించారు.

మల్లురవికి అభినందనలు



నవాబుపేట: ఢిల్లీలో ప్రభుత్వ అధికార ప్రతినిధిగా ప్రమాణస్వీకారం చేసిన మల్లురవిని మండలానికి చెందిన నాయకులు మల్లేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. బంగ్లారవి, ఖాజా, శివరాములు పాల్గొన్నారు.

బాలానగర్: జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు తిరుపతి ఆధ్వర్యంలో మల్లురవికి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలి

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు రాజ్యాంగ సవరణ చేసి పార్లమెంట్‌లో పెట్టకుండా కమిటీలు అంటూ కాలయాపన చేయడం బీజేపీ ప్రభుత్వానికి తగదని ఎమ్మార్పీఎస్ (టీఎస్) దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కోటకదిరలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ నేరవేర్చకుండా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కాలయాపన చేస్తున్నాయని వాపోయారు. మాదిగలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తక్షణమే పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీకి ఓటు ద్వారా తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ గ్రామ స్థాయి నుంచి మండల, నియోజకవర్గ స్థాయిలలో నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా కొత్త నర్సిములు, ఉపాధ్యక్షుడిగా రాములు, ప్రధాన కార్యదర్శిగా మల్లేష్‌లను ఎన్నుకున్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంబులయ్య, జిల్లా అధ్యక్షుడు నరేష్, నాయకులు రమేష్, రాము, నర్సిములు, అశోక్, వెంకటేష్, మల్లేష్, మన్యంకొండ తదితరులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గంతో మల్లెపోగు శ్రీనివాస్

ఘనంగా గంధ్రకోటి కుమారశాస్త్రుల ఆరాధన

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ పుణ్యక్షేత్రంలో భక్తజనకోటికి అన్నదానం చేస్తున్న గంధ్రకోట కుమారశాస్త్రులు ఆదర్శనీయుడని ఆలయ చైర్మన్ చిన్నకృష్ణయ్య అన్నారు. ఆదివారం ఆలయంలో గంధ్రకోటి కుమారశాస్త్రుల బృందావనం వద్ద ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడారు. పూర్వం గంధ్రకోట కుమారశాస్త్రుల వారు పాదయాత్రగా శ్రీశైలం వెళ్తూ.. అలంపూర్‌లో బస చేశారని అన్నారు. ఆ సమయంలో తోటి పాదయాత్రికులు పడుతున్న క్షుద్బాధ(ఆకలిబాధ) చూసి ఆయన ఈ ప్రాంతంలో భిక్షాటన చేసి సమకూర్చిన నిధులతో ఇక్కడ అన్నదాన సత్రం నెలకొల్పారని అన్నారు. నాటి నుంచి నేటి వరకు ఇక్కడ అన్నదానాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ఆనాటి నుంచి ఇక్కడ ఆరాధనోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ అని ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ధనుంజయ శర్మ, క్రిష్ణమూర్తి శర్మ, త్యాగరాజ శర్మ, అన్నదాన సత్రం ఇన్‌చార్జ్ ప్రదీప్, భక్తులు ఆకుమళ్ల జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.



గంధ్రకోటకుమారశాస్త్రుల ఆరాధనలో అర్చకులు, చైర్మన్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నారాయణపేట రూరల్: పట్టణంలోని ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1974–76 విద్యాసంవత్సరంలో ఇంటర్ విద్యను అభ్యసించిన పలువురు పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. తమ ఉన్నత చదువులు, ఉద్యోగ అన్వేషణ, పెళ్లిలు జరిగి ఒక్కో చోట స్థిర పడ్డారు. అయితే వీరంత ఆదివారం స్థానిక శీలా గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో సమావేశమయ్యారు. ఒక్కొక్కరు వారి కుటుంబ సభ్యులతో హాజరై కళాశాల పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తీపి గుర్తులను ఒకరితో మరొకరు పంచుకుని ఆనందంగా గడిపారు. వివిధ రకాలైన ఆటాపోటీలు, పాటల పోటీలు నిర్వహించుకుని, సమిష్టిగా భోజనాలు చేశారు. కార్యక్రమంలో నాగరాజు, భీంచందర్‌గౌడ్, మల్లికార్జున్, భీమయ్య, కాశీనాథ్, విద్యులత, కుసుమ, యాదగిరి, దేవేందర్ పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతాం

గండేడ్: అభివృద్ధిలో పరిగి నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలబెడతామని ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కొంరెడ్డిపల్లిలో పంచాయతీ ప్రహరీని, సల్కర్‌పేట్‌లో హెల్త్‌సెంటర్, సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, వెన్నాచేడ్‌లో హెల్త్‌సెంటర్ శంకుస్థాపన, మత్స్యసహకార సంఘం భవనం శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొని ప్రారంభించారు. మండల అభివృద్ధి అధిక నిధులు కేటాయించేందుకు కృషి చేస్తామని వివరించారు. ఎంపీడీఓ శంకర్‌నాయక్, సర్పంచ్‌లు జితేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పుల్లారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు అనంతలక్ష్మారెడ్డి, పులీందర్, చిన్నయ్య, మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు బోయిని గోపాల్, ప్రధాన కార్యదర్శి నర్సిములు, నరోత్తంరెడ్డి, ఆయా గ్రామాల నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మత్స్య సంఘం భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

మహమ్మదాబాద్: ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదివారం నంచర్లలో పాఠశాల భవనం, సీసీరోడ్లు, సంగాయపల్లిలో పంచాయతీ భవనం, ధర్మాపూర్‌లో అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. పరిగి పూడూర్‌లో నేవీ రాడార్ కేంద్రానికి అనుమతులు వచ్చాయన్నారు. పరిగి నుంచి కృష్ణా రైల్వేలైన్‌కు కూడా అనుమతులు వచ్చాయని వివరించారు. పాలమూరు ఎత్తిపోతలను పరిగిలో ప్రతి మండలానికి తీసుకువచ్చే విధంగా సీఎం, మంత్రులతో మాట్లాడానని వివరించారు. సర్పంచ్‌లు అనసూయ, చాందినీ, దేవి, నర్సమ్మ, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు నారాయణ, ఎంపీడీఓ శంకర్‌నాయక్, మాజీ ఎంపీపీ శాంతీబాయి తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదివారం నంచర్ల పాఠశాల ఆవరణలో పీఆర్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జిల్లా అధ్యాక్షుడు బాల్‌రాజ్, జిల్లా ప్రధానకార్యదర్శి విజయభూషణ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాంచందర్, గండేడ్ మండల అధ్యక్షుడు మహిపాల్ పాల్గొన్నారు.

ఉస్మానియాకు బాధితుడి తరలింపు

అడ్డాకుల: మూసాపేట మండలం సంకలమద్ది స్టేజీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడిని కుటుంబ సభ్యులు ఉస్మానియాకు తరలించారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అల్వాలకు చెందిన వెంకటస్వామి శనివారం సాయంత్రం హైదరాబాద్ నుంచి ట్రాలీ ఆటోలో సొంతూరికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో జాతీయ రహదారిపై సంకలమద్ది బస్‌షెల్టర్ వద్ద ముందు వెళ్తున్న లారీ వెనుక ఆటో ఢీకొట్టుకుంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకటస్వామిని స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా మెరుగైన చికిత్స కోసం బంధువులు బాధితుడిని ఆదివారం హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తరలించారు.